

**పోస్టాఫీస్‌లో నిధుల గోల్‌మాల్**

పోస్టుమాస్టర్, సహాయక పోస్టుమాస్టర్ అక్రమాలకు పాల్పడి పోస్టాఫీస్‌లో పొదుపు నిధులు గోల్‌మాల్ చేశారు. వారిద్దరినీ ఖాతాదారులు గదిలో బంధించారు.

- 8లో..



**భయపడొద్దు..**

**ధైర్యంగా ముందుకు వెళదాం**

అధికార పార్టీ అరాచకాలు, బెదిరింపులకు వైఎస్సార్ సీపీ శ్రేణులు భయపడవద్దని వై.పాలెం ఎమ్మెల్యే తాటిపర్తి పిలుపునిచ్చారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం

39/30

**వాతావరణం**

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

## న్యూస్‌రీల్

### కేజీబీవీలో బాలిక ప్రసవంపై డీఎస్పీ విచారణ

కొత్తపట్నం: మండలంలోని మోటుమాల కేజీబీవీలో బాలిక ప్రసవంపై గురువారం ఒంగోలు డీఎస్పీ కిషోర్, చీమకుర్తి సీఐ సుబ్బారావు విచారణ చేపట్టారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి వివరాలు సేకరించారు. బాలిక గర్భం దాల్చడం, ప్రసవించడంపై అన్నికోణాల్లో సమాచారం సేకరించారు. బాలిక ప్రసవించిన ప్రాంతాన్ని, బాలిక నిద్రిస్తున్న గదిని పరిశీలించారు. ఈ సంఘటనకు సంబంధించి అసలైన నిందితులను వెంటనే పట్టుకుంటామని వారు తెలిపారు. వారి వెంట కొత్తపట్నం ఎస్సై బి.సాంబశివరావు ఉన్నారు.

### రొయ్య రైతులకు న్యాయం చేసేందుకు కృషి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా, మత్స్యశాఖ కమిషనర్ శంకర్



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: రొయ్య రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. గురువారం ప్రకాశం భవనంలో రొయ్యల రైతులు, హెచరీల యజమానులతో మత్స్యశాఖ ఆధ్వర్యంలో మోనోడాన్ రొయ్యల పెరుగుదలపై సమీక్ష నిర్వహించారు. మత్స్యశాఖ కమిషనర్ తమ్మి డోలా శంకర్, కలెక్టర్, రొయ్యల సంక్షేమ సంఘ అధ్యక్షుడు గోపీనాథ్ పాల్గొన్నారు. గూడూరు, మున్నంగి హచరీల నుంచి దిగుమతి చేసుకున్న నాసిరకం సీడ్ అయిన పి మోనోడాన్ సీడ్ వల్ల రొయ్య ఎదుగుదల తగ్గిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని, రైతులను ఆదుకుని పరిహారం ఇప్పించాలని కోరారు. రొయ్యల హెచరీ నుంచి పి మోనోడాన్ సీడ్ శాంపిల్స్ సేకరించి ఎస్‌ఎఫ్‌డీబీ హైదరాబాద్ ల్యాబ్‌కు పంపామని, సీడ్ నాణ్యతా పరీక్ష అనంతరం నివేదికను అనుసరించి రొయ్య రైతులకు తగిన న్యాయం చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి కృషి చేస్తామని కలెక్టర్, మత్స్యశాఖ కమిషనర్ తెలిపారు. మత్స్యశాఖ జిల్లా అధికారి చంద్రశేఖరరెడ్డి, నెల్లూరు జిల్లా మత్స్యశాఖ అధికారి ఎం.నాగేశ్వరరావు, మత్స్యశాఖ సహాయ సంచాలకులు పాల్గొన్నారు.

### ఒలింపిక్స్ క్రీడాకారులకు సపోర్ట్‌గా నిలవాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా




ఒంగోలు అర్బన్: పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌లో పాల్గొనే మన రాష్ట్ర, దేశ క్రీడాకారులకు ప్రతిఒక్కరూ సపోర్ట్‌గా నిలవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరారు. గురువారం ప్రకాశం భవనంలో క్రీడాకారులను అభినందిస్తూ ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌లో కలెక్టర్ సెల్ఫీ దిగారు. ఒలింపిక్స్‌లో పాల్గొనే క్రీడాకారులు ప్రతిభ కనబరిచి దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ రాజరాజేశ్వరి, బాక్సింగ్ కోచ్ వేణు, సెపక్‌తక్రా కోచ్ శ్రీనివాసరావు, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# పచ్చ మాఫియా గుప్పిట

# పేదల ముద్ద



| జిల్లాలో రేషన్ షాపులు |
|---|
| 1,392 |
| మొత్తం కార్డులు |
| 6,70,571 |
| కేటాయించిన బియ్యం |
| 9,500 టన్నులు |

**పేదలకు చెందాల్సిన** బియ్యాన్ని పక్కాగా దోపిడీ చేసేందుకు టీడీపీ నేతలు సకలం సిద్ధం చేసుకున్నారు. అధికారంలోకి వచ్చిందే తడువుగా నిరుపేదల కడుపుకొట్టే దందాకు తెరతీశారు. అన్నపుముద్దలు కావాల్సిన బియ్యాన్ని అంగడి సరుకుగా మార్చి జేబులు నింపుకొనేందుకు ప్రజాప్రతినిధులతో కలిసి మంతనాలు చేశారు. కొందరు రింగ్ మాస్టర్లు పథకం ప్రకారం రేషన్ దుకాణాలపై కన్నేసి తొలుత డీలర్లతో బలవంతంగా రాజీనామాలు చేయించారు. తమ అనుచరులకే వచ్చేలా ఎమ్మెల్యేల ద్వారా అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. పీడీఎస్ బియ్యాన్ని గద్దల్లా తన్నుకుపోయి సోమ్ము చేసుకునేందుకు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు రంగం సిద్ధం చేసుకున్నారు. రేషన్ దందాకు అడ్డు చెప్పకుండా సివిల్ సప్లయిస్, విజిలెన్స్ అధికారుల నోళ్లు మూయించే పని ఇప్పటికే పూర్తయింది. ఈ మేరకు నియోజకవర్గ ముఖ్య నేతలకు నెల మామూళ్లు చెల్లించేలా 'బియ్యం దెయ్యాలు' డీల్ సెట్ చేశాయన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

- తప్పు చేయకున్నా తప్పుకోవాల్సిందేనని రేషన్ డీలర్లకు హుకుం
- రాజీనామా చేయకుంటే సరుకులు ఇవ్వద్దని అధికారులకు ఆదేశాలు
- మాట వినని వారిపై తప్పుడు కేసులు బనాయించాలని ఒత్తిడి
- జిల్లాలో వెయ్యి మంది డీలర్లపై వేటు వేసిన కూటమి సర్కార్
- దర్శిలో రేషన్ దందాకు నెలకు రూ.25 లక్షలతో డీల్ సెట్
- మిగిలిన నియోజకవర్గాల్లోనూ నెల మామూళ్లు ఇచ్చేలా ఒప్పందాలు
- సైలెంట్ మోడ్‌లో ఉండాలని రెవెన్యూ, పోలీస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు మౌఖిక ఆదేశాలు

**సాక్షి ప్రతినిధి, ఒంగోలు:** గతంలో అధికారంలో ఉండగా ఇసుక, గ్రావెల్, రేషన్ బియ్యం దోపిడీలో ఆరితేరిన టీడీపీ నాయకులు మళ్లీ తమ ప్రధాన ఆర్థిక వనరులను పరిపుష్టం చేసుకునే పనిలో తలమునకలయ్యారు. అధికార పార్టీ నేతలు అప్రతిహతంగా తిప్పుతున్న ఈ అవినీతి చక్రంలో పౌరసరఫరాల శాఖ అధికారులను ఇరుసుగా మార్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. కాస్త కందెన వేసి కాసులు దండుకునేందుకు కొత్త రేషన్ డీలర్ల అవతారమెత్తిన టీడీపీ చోటా నేతలు సిద్ధమయ్యారు. జిల్లాలో 1392 రేషన్ దుకాణాలు ఉన్నాయి. టీడీపీ సానుభూతిపరులు, పర్మినెంట్ రేషన్ డీలర్లను మినహాయిస్తే సుమారు 1000 మందికి పైగా డీలర్లను కూటమి ప్రభుత్వం కుట్రతో పక్కనబెట్టింది. జిల్లాలో 6,76,160 రేషన్ కార్డుదారులకు ప్రతి నెలా పంపిణీ చేస్తున్న 9500 టన్నుల పీడీఎస్ బియ్యంపై టీడీపీ నేతలు అధికారంలోకి రాగానే కన్నేశారు.

**చెప్పిన చోట బియ్యం దింపండి**

టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే బియ్యం దందా ప్రారంభించిన కొందరు నాయకులు.. తమ అక్రమాలకు సహకరించని డీలర్లపై కత్తిగట్టారు. పేదలకు కొద్దొగొప్పో రేషన్ ఇచ్చి మిగిలిన బియ్యాన్ని తాము చెప్పిన వారికి అందించాలని హుకుం జారీ చేశారు. అందుకు ఒప్పుకోని వారితో బలవంతంగా రాజీనామాలు చేయించారు. పలుచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని సక్రమంగా రేషన్ బియ్యం ఇస్తున్న డీలర్లను కూడా తొలగించాలని అధికారులకు ఆదేశాలు వెళ్లాయి.

అక్రమాలకు సహకరించని డీలర్లకు సరుకు పంపిణీ చేయకుండా పౌరసరఫరాల శాఖ గోడౌన్ డీటీలకు హుకుం జారీ చేశారు. వారం రోజుల క్రితమే నియోజకవర్గాల్లో రేషన్ డీలర్లందరికీ బియ్యం సరఫరా చేయాల్సి ఉండగా ఈనెల 31వ తేదీ వరకు పంపిణీ పూర్తి చేయలేదంటే అధికారులపై టీడీపీ నేతల ఒత్తిళ్లు ఏ స్థాయిలో ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇదిలా ఉండగా.. దర్శి ఒకటో నెంబర్ షాపులో తోలాల్సిన బియ్యాన్ని టీడీపీ నేత చెప్పాడని సందువారిపాలెం రోడ్డులో ఉన్న ఓ భవనంలో దింపారు. ఆ నోటా ఈ నోటా విషయం బయటకు పొక్కడంతో అప్రమత్తమైన అధికారులు తమ ఉద్యోగాలకు ఎక్కడ ముప్పు వస్తుందోనని ఆ బియ్యాన్ని తిరిగి లారీలో దొనకొండ గోడౌన్‌కు తరలించినట్లు టీడీపీ నేతలే చర్చించుకుంటున్నారు.

**దర్శిలో భారీ డీల్**

దర్శి నియోజకవర్గంలో రేషన్ అక్రమ దందాకు తెరలేచింది. వినుకొండకు చెందిన టీడీపీ ముఖ్య నేతల ప్రధాన అనుచరుడు, గతంలో ఏఎంసీ చైర్మన్‌గా పనిచేసిన వ్యక్తి ఈ అక్రమ బాగోతంలో చక్రం తిప్పుతున్నారు. గడిచిన 20 ఏళ్లలో బియ్యం దందాతో రూ.100 కోట్లు పోగేసినట్లు ఆరోపణలున్న ఈ వ్యక్తి దర్శిలో అడుగుపెట్టడం స్థానిక టీడీపీ నేతలకు కన్ను మీద కునుకు లేకుండా చేస్తోంది. ఒక ఎంపీతో దర్శి టీడీపీ ముఖ్య నేతలకు సిఫార్సులు చేయించి మరీ రేషన్ దందా నడిపేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. నియోజకవర్గంలో ఐదు మండలాల్లో రేషన్ బియ్యం పక్కకు పోకుండా తనకే ఇస్తే నెలకు రూ.25 లక్షలు ఇచ్చేందుకు డీల్ సెట్ చేసుకున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. బియ్యం రవాణాపై పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్పందించకుండా ఉండేలా ఇప్పటికే మౌఖికంగా ఆదేశాలు సైతం జారీ అయినట్లు ఆరోపణలు ఉన్నాయి. స్థానిక టీడీపీ నేతలు రూ.20 లక్షలు ఇచ్చేందుకు ముందుకురాగా 'చూద్దాం లే' అని చెప్పిన ముఖ్య నాయకులు.. పైనుంచి వచ్చిన సిఫార్సులతో రూ.25 లక్షల డీల్‌కు 'పచ్చ' జెండా ఊపారు. ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్న స్థానిక టీడీపీ నేతలు లోలోన రగిలిపోతున్నారు. 'ఇన్నాళ్లూ పార్టీ కోసం కష్టపడేది మేము. డబ్బులు సంపాదించునేది పక్క నియోజకవర్గపోడా'' అంటూ మండిపడుతున్నారు. గత నెలరోజులుగా జరుగుతున్న ఈ తతంగం దర్శి నియోజకవర్గంలో చర్చ నీయాంశంగా మారింది.

**తప్పులక్కర్లేదు.. తప్పుకోవాల్సిందే..**

రేషన్ డీలర్లు అవకతవకలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తారు.. కానీ టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తప్పు చేయకున్నా సరే డీలర్లను సాగనంపే దుస్సంప్రదాయానికి తెరతీశారు. గిద్దలూరు నియోజకవర్గంలో ఇప్పటికే 10 మంది డీలర్లు రాజీనామా చేశారు. బేస్తవారిపేట మండలంలో ఖాజీపురం, మోక్షగుండం, అక్కపల్లె పంచాయతీల్లో డీలర్లను తప్పించారు. త్వరలోనే భారీ సంఖ్యలో డీలర్లను పక్కనబెట్టేందుకు రంగం సిద్ధం చేశారు. మార్కాపురం పట్టణం, రూరల్‌లో కలిపి గురువారం ఒక్కరోజే సుమారు 20 షాపులను టీడీపీ కార్యకర్తలు తమ చేతుల్లోకి తీసుకున్నారు. తర్లుపాడు, కొనకనకనమిట్ల, పొదిలి మండలాల్లోనూ టీడీపీ నాయకులే డీలర్లు ఉండేలా నియోజకవర్గ ముఖ్య నేత హుకుం జారీ చేశారు.

### దొంగల చేతికి తాళం

కొండపి నియోజకవర్గంలో రేషన్ బియ్యం పంపిణీ తీరు దొంగకు తాళం అప్పగించిన చందంగా ఉంది. సింగరాయకొండ ఎంఎల్‌ఎస్ పాయింట్ రేషన్ కాంట్రాక్టర్ రాజీనామా చేయడంతో నిబంధనలకు విరుద్ధంగా స్థానిక రైస్ మిల్లుకు చెందిన వాహనాలు, కూలీలతో బియ్యం సరఫరా చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో రేషన్ డీలర్లతో బలవంతంగా రాజీనామాలు చేయించారు. సింగరాయకొండ మండలంలో 9 షాపులు, జరుగుమల్లి మండలంలో 12 షాపులను టీడీపీ సానుభూతిపరులకు అప్పగించారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ భవనంలో, సదరు రెవెన్యూ అధికారి ఆధీనంలో ఉన్న గదుల్లో బియ్యం దింపాల్సి ఉండగా.. నేరుగా టీడీపీ సానుభూతిపరుల ఇళ్లకు చేర్చడం విమర్శలకు తావిస్తోంది.



టీడీపీ సానుభూతిపరుల ఇళ్ల దగ్గర దించుతున్న రేషన్ బియ్యం

### వైపాలెంలో రేషన్ వార్

రేషన్ బియ్యం దందా విషయంలో టీడీపీ వర్గీయుల మధ్య పొరపొచ్చాలు రావడంతో తీవ్ర స్థాయిలో కలహించుకుంటున్నారు. గత నెల 30వ తేదీ అర్ధరాత్రి సమయంలో త్రిపురాంతకం మండలంలోని డీవీఎస్ కాలనీలో నిల్వ ఉంచిన బియ్యాన్ని తరలించేందుకు ఆ మండలానికి చెందిన టీడీపీ నాయకులు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న యర్రగొండపాలెం పార్టీ నాయకుడు తన కారులో హుటాహుటిన వెళ్లి తామే తరలిస్తామని తేల్చి చెప్పాడు. అందుకు వారు నిరాకరించడంతో పాటు ఘర్షణకు దిగారు. కారు అద్దం కూడా ధ్వంసమైనట్లు తెలిసింది. ఆ నాయకుడు వెంటనే పోలీస్ స్టేషన్‌కు చేరుకుని రేషన్ బియ్యం అక్రమంగా తరలించే ప్రధాన టీడీపీ వర్గీయుడిపై ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించాడు. అర్ధరాత్రి సమయంలో డీవీఎస్ కాలనీకి ఎందుకు వెళ్లావని పోలీసులు ప్రశ్నించడంతో అతను వెనుదిరిగినట్లు తెలిసింది. టీడీపీకి చెందిన కొంతమంది నాయకులు కూటమిగా ఏర్పడి నియోజకవర్గ స్థాయిలో అక్రమంగా రేషన్ బియ్యం రవాణా చేసేందుకు సన్నద్ధమయ్యారు. ఈ విషయంపై ఆ పార్టీకి చెందిన నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఎదుట పంచాయితీ పెట్టినట్లు తెలిసింది.

# తల్లిపాల బ్యాంకు ఏర్పాటుకు చర్యలు

- తల్లిపాల వారోత్సవాల ప్రారంభ సభలో కలెక్టర్ తమీమ్ అన్సారియా



తల్లిపాల వారోత్సవాల ప్రారంభ సభలో ప్రసంగిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

**ఒంగోలు టౌన్:** నేటి ఆధునిక సమాజంలో ఎంతో మంది శిశువులు తల్లిపాలు తాగే అదృష్టానికి నోచుకోలేకపోతున్నారని, అలాంటి వారిని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో మదర్ మిల్క్ బ్యాంకు ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. స్థానిక జీజీహెచ్‌లో గురువారం తల్లిపాల వారోత్సవాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసంగిస్తూ కొందరు ఉద్యోగులు ప్రసూతి సెలవులు అయిపోయిన తర్వాత తమ పిల్లలకు పాలివ్వడానికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఆ ఇబ్బందులను అధిగమించడానికి ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కుంటున్నారన్నారు. మరికొందరు పిల్లలకు పాలు మరిపిస్తున్నారన్నారు. ఇది సరైన విధానం కాదని, పిల్లలకు తప్పనిసరిగా 2 సంవత్సరాల పాటు పాలివ్వడం ఎంతో అవసరమని సూచించారు. సమయానికి పాలు ఇవ్వలేని పరిస్థితుల్లో వైద్యుల సలహాలను అనుసరించి పాలను పంప్ చేసి ఫ్రిజుల్లో భద్రపరిచి ఇవ్వడం మంచిదన్నారు. జీజీహెచ్‌లో కూడా తల్లులకు ఫీడింగ్ పంప్స్ అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. మనదేశంలోని పెద్ద పెద్ద నగరాల్లో తల్లిపాల బ్యాంకులు ఉన్నాయని, ఇక్కడ కూడా అలాంటివి ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ అన్నారు. బిడ్డకు ఎంత ఎక్కువగా పాలిస్తే అంత ఎక్కువగా పాలుపడతాయని, బిడ్డకు సరిపోగా మిగిలిన పాలను పంప్ చేయడం ద్వారా స్టోర్ చేసి తల్లి పాలకు నోచుకోని పసిబిడ్డలకు ఇవ్వాలని సూచించారు. నర్సింగ్ విద్యార్థులు, ఏఎన్‌ఎంలు గ్రామీణ ప్రాంతాల్లో తల్లి పాల ప్రాధాన్యత గురించి అవగాహన కల్పించాలన్నారు. పిల్లలకు ఆస్తి, మంచి చదువు ఎంత అవసరమో మంచి ఆరోగ్యం ఇవ్వడం కూడా అంతే అవసరమని తెలిపారు. బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా మాత్రమే మంచి ఆరోగ్యం ఇవ్వగలుగుతారని చెప్పారు. కృత్రిమ పాలు తాగిన పిల్లల్లో సుగర్, అధిక బరువు, పీసీఓడీ లాంటి జీవనశైలికి సంబంధించిన రుగ్మతలు వస్తున్నాయని తెలిపారు. తల్లిపాలు ఒక గోల్డెన్ డోస్ అని ప్రతి తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. బిడ్డలకు పాలివ్వని తల్లుల్లో బ్రెస్ట్ క్యాన్సర్ సమస్య అధికంగా కనిపిస్తోందని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు తెలిపారు. ముర్రుపాలలో ఐజీఏ ఇమ్యూనోగ్లోబిన్ ఉంటుందని, ఇది జీవితాంతం ఆరోగ్యానికి రక్షణ కల్పిస్తుందని చెప్పారు. కేవలం 6 నెలల పాటు మాత్రమే పాలివ్వడం తల్లికి, బిడ్డకి మంచిది కాదని హితవుపలికారు. పిడియాట్రిక్ హెచ్‌ఓడీ డా.ఎలిజిబెత్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ సురేష్‌కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాదేవి, ఆర్‌ఎంఓ డాక్టర్ చెంచయ్య, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ తీర్పుపై పైబెంచికి వెళ్తాం

- మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య



మాట్లాడుతున్న మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య

**ఒంగోలు:** ఎస్సీ వర్గీకరణపై ఏడుగురు సభ్యులున్న సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై మరో ఉన్నత బెంచికి వెళ్తామని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిళ్లా చెన్నయ్య తెలిపారు. గురువారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ మౌలిక సూత్రాలకు వ్యతిరేకమని, అమలు సాధ్యం కాదని ఒకే ఒక న్యాయమూర్తి జస్టిస్ ఎం.బేలా త్రివేది స్పష్టం చేశారన్నారు. చాలా కాలంగా దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల అంశానికి సుప్రీంకోర్టు పచ్చ జెండా ఊపడం ద్వారా గతంలో ఐదుగురు సభ్యులున్న ధర్మాసనం ఇచ్చిన తీర్పును కొట్టివేసిందన్నారు. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు వర్గీకరించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కి వ్యతిరేకమన్నారు. ఈ సెక్షన్ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో రాజకీయ ప్రమేయాన్ని నిరోధిస్తుందన్నారు. షెడ్యూలు కులాలకు ప్రత్యేక హోదా కల్పించేలా రిజర్వేషన్ వ్యవస్థ ఉందని, ఇందులో ఎలాంటి మార్పులు చేయాలన్నా రాష్ట్రపతి ద్వారా మాత్రమే జరగాలని అన్నారు.

అందువలన మాలమహానాడు తరఫున దేశవ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా మాల సామాజిక వర్గాలందరినీ కలుపుకుని మళ్లీ కోర్టు ద్వారా పాత పద్ధతిలోనే రిజర్వేషన్లు ఉండే విధంగా న్యాయపోరాటం చేస్తామని చెన్నయ్య స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తుల వెంకట్రావు పాల్గొన్నారు.

# ఈ లెక్కల్లో తేడా ఏంటి సారూ ?

- జిల్లా అధికారుల లెక్కలకు.. క్షేత్రస్థాయి లెక్కలకు తేడా
- పింఛన్ల పంపిణీ లెక్కల్లో నిజమెంత ?



ఒంగోలు బత్తులవారికుంటలో గురువారం పింఛన్ కోసం ఎదురు చూస్తున్న వృద్ధులు

**ఒంగోలు టౌన్:** ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ వ్యవహారంలో అధికారులు చెబుతున్న లెక్కల్లో చాలా వ్యత్యాసం కనిపిస్తోంది. జిల్లా అధికారులు చెప్పే లెక్కలకు, క్షేత్రస్థాయిలో లెక్కలకు పొంతన ఉండటం లేదు. రాష్ట్రంలోటీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా జూలై ఒకటో తేదీ పింఛన్లు పంపిణీ చేశారు. అప్పుడు అధికారులు జిల్లాలో 2,91,524 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ప్రకటించారు. అందుకోసం 199.07 కోట్ల రూపాయల నిధులను ప్రభుత్వం విడుదల చేసినట్లు డీఆర్డీఏ అధికారులు తెలిపారు. తాజాగా గురువారం పంపిణీ చేసిన పింఛన్ల లెక్కల్లోకొచ్చేసరికి లెక్క మారింది. ఈ నెల 2,91,419 మందికి పింఛన్లు పంపిణీ జరుగుతోందని, ఇందుకోసం 123.92 కోట్ల రూపాయల నిధులు విడుదల చేసినట్లు గత నెల 29వ తేదీ ప్రకటన ఇచ్చారు. తీరా పింఛన్ల పంపిణీ దగ్గరకు వచ్చేసరికి మరో కొత్త లెక్క చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 2,89,942 మందికి పింఛన్లకుగానూ తొలిరోజు 2,79,856 పింఛన్లు పంపిణీ చేసినట్లు చెబుతున్నారు. ఇవి కాకుండా 1,483 ఏఆర్టీ పింఛన్లు ఉన్నాయని, వీరికి నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని చెబుతున్నారు. వీరు కాకుండా మరో ఇద్దరు డిజేబుల్ విద్యార్థులకు కూడా నేరుగా బ్యాంకు ఖాతాలో జమచేస్తామంటున్నారు.

**క్షేత్రస్థాయిలో ఇలా...**

జిల్లా అధికారుల లెక్కల ప్రకారం ఒక పింఛన్ కూడా తప్పకుండా అందరికీ పంపిణీ చేసినట్లు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు చెబుతున్న లెక్కల ప్రకారం అయితే.. ప్రతి నియోజకవర్గంలోనూ పెద్ద సంఖ్యలో పింఛన్ల కోత కనిపిస్తోంది. జిల్లాలోని కనిగిరి నియోజకవర్గంలో జూలైలో ఇచ్చిన పింఛన్ల కంటే ఆగస్టులో ఇచ్చిన పింఛన్ల సంఖ్య 257 తగ్గింది. ఇదే విధంగా జిల్లా వ్యాప్తంగా చూస్తే.. మార్కాపురం 61, కొండపి 220, సంతనూతలపాడు 134, యర్రగొండపాలెం 38, దర్శి 208, గిద్దలూరు 200, ఒంగోలు రూరల్ 9 పింఛన్లు తగ్గాయి. ఒంగోలు నగరంలో పింఛన్ల సంఖ్య చెప్పేందుకు అధికారులు అందుబాటులోకి రావడం లేదు. ఈ లెక్కలను పరిశీలిస్తే జిల్లాలో 1,127 మందికి పింఛన్లు ఇవ్వలేదు. ఇందుకు కారణం ఏమిటని అడిగితే అధికారులు తలాతోకా లేని జవాబు చెబుతున్నారు. గత మూడు నెలల్లో జిల్లాలో 300 మంది లబ్ధిదారుల వరకు మృతి చెందారని, ఆ వివరాలను ఇంకా అప్డేట్ చేయలేదని చెప్పడం గమనార్హం.

**96.52 శాతం పింఛన్ల పంపిణీ...**

ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీని గురువారం తెల్లవారుజామునుంచే ప్రారంభించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా నగరంలోని కబాడీపాలెం, తూర్పుక్రిస్టియన్‌పాలెంలో అధికారులు, వార్డు సచివాలయ సిబ్బందితో కలిసి పింఛన్లు అందజేశారు. డీఆర్డీఏ ప్రాజెక్టు అధికారి టి.వసుంధర టంగుటూరు మండలంలో జరిగిన పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,89,942 మందికిగానూ 2,79,856 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. తొలిరోజు రాత్రి 8.45 గంటలకల్లా 96.52 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు డీఆర్డీఏ పీడీ తెలిపారు. ఈ పింఛన్లతో పాటు ఏఆర్టీ పింఛన్లు మరో 1,483, డిజేబుల్ విద్యార్థులకు 2 పింఛన్లు నేరుగా వారి ఖాతాలోనే జమచేస్తామని వివరించారు. జిల్లాలోని 5,723 మంది సచివాలయ ఉద్యోగులు, ఇతర శాఖలకు చెందిన సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ తీర్పుపై హర్షం



జీజీహెచ్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న సుజన్ మాదిగ, తదితరులు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్ మాదిగ, తదితరులు

**ఒంగోలు:** ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా గురువారం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. సుదీర్ఘంగా 30 ఏళ్లుగా సాగిన నిరంతర ఉద్యమానికి ప్రతిఫలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుజన్ మాదిగ అన్నారు. తీర్పును హర్షిస్తూ జీజీహెచ్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ నేటితో 30 ఏళ్ల ఉద్యమానికి తెరపడిందన్నారు. ఇన్నాళ్ల కష్టానికి సుప్రీంకోర్టు తీర్పుతో న్యాయం జరిగిందన్నారు. న్యాయమైన డిమాండ్‌కు పరిష్కారం అనేది లేటుగా అయినా దొరుకుతుందనేందుకు ఇదే నిదర్శనమన్నారు. ఎంతోమంది త్యాగాలు, ఎంతోమంది బలిదానాలు, ఎంతోమంది జైలు జీవితాలు, అరెస్టులు, ఇవన్నీ కలగలిపితే సుప్రీంకోర్టు తీర్పు అని, ఈ తీర్పు తమను అమితానందానికి గురిచేసిందని అన్నారు. కార్యక్రమంలో నగర కన్వీనర్ అంగలకుర్తి ప్రసాద్, బార్ అసోసియేషన్ సభ్యుడు సుందర్‌సింగ్, దుడ్డు వినోద్ మాదిగ, విజయ్‌మాదిగ, డొక్కా శ్రీను మాదిగ, బాలాజీ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

**ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో సంబరాలు...**

ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పుతో జిల్లాలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి. ఒంగోలు నగరంలోని పలుచోట్ల ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు క్షీరాభిషేకం నిర్వహించి స్వీట్లు పంచుకున్నారు. ఎంఆర్‌పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. అనంతరం స్థానిక అంబేడ్కర్‌భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు మాట్లాడుతూ 30 ఏళ్ల సుదీర్ఘ ఉద్యమ పోరాటానికి తగిన ప్రతిఫలం లభించిందన్నారు. తమ నాయకుడు మంద కృష్ణమాదిగ నేతృత్వంలో ఎస్సీలను ఏబీసీడీలుగా విభజించాలనే డిమాండ్‌తో చేసిన ఉద్యమానికి అనేక అడ్డంకులు వచ్చాయన్నారు. ఈ పోరాటంలో ఎంతమంది అశువులు బాశారన్నారు. ఎంతోమంది ఉద్యమంపై విమర్శలు చేసినా మాదిగలు లక్ష్య సాధనలో నిలిచిన తీరుకు కృతజ్ఞతలు తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును దేశం మొత్తం హర్షిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు తొర్రటి ఆనంద్, భిక్షాలు, నేలపాటి రాజు, తిరువీధి బాబు, మాదిగ ఉద్యోగుల సంఘ నాయకులు సర్వేపల్లి రవిరాజ్, కత్తి ఐజాక్, జిట్రా బాబూరావు, తేళ్ల జాలరావు, పి.కిషోర్, నిరంజన్‌కుమార్, ప్రకాష్, ఇత్రాయేలు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### హెచ్చరిక బోర్డు ఏర్పాటు



బస్‌షెల్టర్ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

బేస్తవారిపేట: స్థానిక అంకాలమ్మ వీధిలో జాతీయ రహదారి పక్కన బస్ షెల్టర్ నిర్మాణం కోసం కేటాయించిన రూ.70 లక్షల విలువైన 20 సెంట్ల స్థలాన్ని ఆక్రమించేందుకు ఓ టీడీపీ నాయకుడు యంత్రంతో చదును చేశాడు. దీనిపై సాక్షిలో ఈ నెల 1వ తేదీన ‘రెచ్చిపోతున్న పచ్చ భూబోళ్లు’ అనే శీర్షికతో ప్రచురితమైన కథనంతో రెవెన్యూ అధికారులు, గిద్దలూరు ఆర్టీసీ డిపో అధికారులు స్పందించారు. వీఆర్వో రాజు, విలేజ్ సర్వేయర్ శ్రీవిద్యలు బస్‌షెల్టర్‌కు కేటాయించిన స్థలాన్ని గురువారం పరిశీలించారు. యంత్రాంతో చదును చేసిన ప్రదేశంలో ‘ఇది ఏపీఎస్ఆర్టీసీ స్థలం ఇందులో వరు ప్రవేశించినా శిక్షార్హులు’ అనే హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

### మనమంతా పోలీస్ కుటుంబసభ్యులం

- డీపీఓ సమీక్షలో ఎస్పీ దామోదర్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: ‘మనమంతా పోలీసు కుటుంబ సభ్యులం, సమష్టిగా పని చేద్దామ’ని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో డీపీఓ సిబ్బందితో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీపీఓ పోలీస్ అధికారులకు, సిబ్బంది జీతభత్యాలు, పదోన్నతుల రికార్డులు, సర్వీస్ పుస్తకాలన్నీ అప్డేటెడ్‌గా సిద్ధం చేయాలని చెప్పారు. పోలీసు సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రికార్డులు నిర్వహించాలన్నారు. పెండింగ్ ఫైళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇతర శాఖలకు సంబంధించిన సమాధానాలను సాధ్యమైనంత త్వరగా పంపించాలన్నారు. సిబ్బంది అందరూ ఆరోగ్య రక్షణపై శ్రద్ధ చూపాలని, కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విధుల్లో ప్రతి ఒక్కరూ సంయమనం, సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, ఎలాంటి నిర్లక్ష్యం వహించినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమీక్షా సమావేశంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీపీఓ ఎం సులోచన, అసిస్టెంట్ ఏఓ ఉస్మాన్‌బాషా, సూపరింటెంట్లు శైలజ, యాస్మిన్‌బా పాల్గొన్నారు.

### ఉరేసుకొని గ్రానైట్ కార్మికుడు ఆత్మహత్య

చీమకుర్తి: సంతనూతలపాడులో గ్రానైట్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేస్తున్న ఐనంపూడి ప్రసాద్(48) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సంతనూతలపాడులోని పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో ఉన్న గ్రానైట్ ఫ్యాక్టరీలో గురువారం ఈ సంఘటన జరిగింది. ఆర్థిక ఇబ్బందులు కారణంగానే ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువుల చెప్పిన వివరాల ప్రకారం పోలీసులు ధృవీకరించారు. ఎస్సై ఎం.దేవకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### తాళాలు పగులగొట్టి చోరీ

మార్కాపురం: పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని ఎస్టేట్ శివారులో నివాసముండే దుగ్గెపోగు సురేఖ ఇంట్లో తాళాలు పగులకొట్టి రూ.35 వేల విలువైన బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన సంఘటన గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం..సురేఖ, భర్త రాజశేఖర్ ప్రైవేట్ ఉద్యోగులు. గురువారం యధావిధిగా ఇంటికి తాళాలు వేసి వెళ్లారు. అయితే సాయంత్రం వచ్చి చూసుకోగా తాళాలు పగులకొట్టి ఇంట్లో బీరువాలో ఉన్న తాళిబొట్టు, మూడు ఉంగరాలు తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పోస్టాఫీస్‌లో పొదుపు నిధుల గోల్‌మాల్

- పోస్టుమాస్టర్, సహాయక పోస్టుమాస్టర్ నిర్వాకం
- ఖాతాదారుల నగదు జమ చేయకుండా స్వాహా
- ఇద్దరినీ గదిలో బంధించిన మహిళలు

టంగుటూరు:

మండలంలోని అనంతవరం పోస్టాఫీస్‌లో పొదుపు నిధుల్లో గోల్‌మాల్ జరిగింది. పోస్టుమాస్టర్ సాయి శ్రీనివాస నాయక్, సహాయక పోస్టు మాస్టర్ కొమ్ము సుందర్ సింగ్‌లు కలిసి నిధులు స్వాహా చేశారు. రెండు రోజుల క్రితం ఖాతాదారుల ఫిర్యాదు మేరకు గురువారం పోస్టాఫీసులో ఉన్నతాధికారులు విచారణ చేశారు. ఖాతాదారులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు అనంతవరం పోస్టాఫీసులో టంగుటూరు అరుంధతీనగరకు చెందిన కొమ్ము సుందర్‌సింగ్ 12 ఏళ్లుగా సహాయక పోస్టుమాస్టర్‌గా, మార్టూరు గ్రామానికి చెందిన సాయి శ్రీనివాస నాయక్ పోస్టుమాస్టర్ రెండేళ్లుగా విధులు నిర్వహిస్తున్నాడు. గ్రామంలోని ఖాతాదారులు పోస్టాఫీసులో ఆర్డీ, ఎస్‌బీ, టీడీ, ఎంఐఎస్, ఆర్‌పీఎల్, పీఎల్ఐ లాంటి పథకాలకు ప్రతి నెల నగదు చెల్లించుకుంటారు. అయితే సంవత్సరం నుంచి ఖాతాదారులు చెల్లించిన నగదుకు పాసుపుస్తకంలో చెల్లించినట్లు ముద్రించకుండా యధావిధిగా తిరిగి ఇస్తున్నారు. ఈ క్రమంలో నగదు చెల్లింపు కాలం ముగిసినా నగదు రాకపోవడంతో ఖాతాదారులకు అనుమానం వచ్చి పోస్టాఫీసుకు వచ్చి విచారించారు. ఈ క్రమంలో పోస్టుమాస్టర్, సహాయక పోస్టుమాస్టర్ కలిసి రూ.12.5 లక్షల నగదు స్వాహా చేసినట్లు తేలింది. విచారణ చేస్తే ఈ మొత్తం మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు. దీంతో పోస్టాఫీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, సౌత్ సబ్ డివిజన్ పోస్టాఫీసర్ రవికుమార్‌రెడ్డి, సూపర్‌వైజర్ ఎం. రవికుమార్ విచారణ చేశారు. నిందితులిపై చట్టపర చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



అనంతవరం పోస్టాఫీసు వద్ద ఆందోళన చేస్తున్న ఖాతాదారులు



నిందితులను విచారిస్తున్న జిల్లా అధికారులు

### నిందితులను గదిలో పెట్టి తాళాలు..

తాము కూలీనాలి చేసి రూపాయి రూపాయి కూడబెట్టుకుంటే ..ఆ నగదును స్వాహా చేసిన పోస్టుమాస్టర్ సాయి శ్రీనివాస నాయక్, సహాయక పోస్టుమాస్టర్ కొమ్ము సుందర్‌సింగ్‌లను ఖాతాదారులు పోస్టాఫీసులో పెట్టి తాళాలు వేశారు. తాము కట్టిన నగదు తిరిగి ఇస్తేనే వదులుతామని భీష్మించుకు కూర్చున్నారు. అధికారులు ఇద్దరి వద్ద నగదు తిరిగి ఇస్తామని పత్రాలు రాయించుకున్నట్లు సమాచారం. అయితే మహిళలు మాత్రం మా డబ్బులు ఇస్తేనే వారిని వదులుతామని పోస్టాఫీస్ వద్దే తిష్ట వేశారు.



అనంతవరం ఖాతాదారులు నిందితులను పోస్టాఫీసులో పెట్టి తాళాలు వేసిన దృశ్యం

# భయపడొద్దు..ధైర్యంగా ముందుకు వెళదాం

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: ‘అధికార పార్టీ నేతల బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదు. వారు చేస్తున్న అవినీతి అక్రమాలను ప్రజల ముందుకు ధైర్యంగా తీసుకువెళదామ’ని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజల సమస్యలపై స్పందించాలని, ఆ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తమ పరిధిలోని సమస్యలను గుర్తించాలన్నారు. ప్రభుత్వం తమది కాదని నిరుత్సాహపడాల్సిన అవసరం లేదన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కోసం ప్రజలు అలమటించి పోతున్నారని, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇటువంటి గడ్డు పరిస్థితి లేదన్నారు. సర్పంచ్‌ల తీర్మాణం లేకుండానే అధికారులు స్థానిక టీడీపీ నేతల ఆదేశాలకు తలవంచి పనులు చేయిస్తున్నారని, అటువంటి పరిస్థితిని ఎదుర్కొవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అధికార పార్టీ నేతల అవినీతి, అక్రమాలను ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జగనన్న అండతో అంతరం ప్రజల పక్షాన నిలిచి సమస్యల పరిష్కారానికి పోరాడుదామని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు అలివికాని వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు తమ ప్రాంత సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లగా..ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి ఓబులరెడ్డి, సర్పంచ్‌లు ఆర్.అరుణాబాయి, తమ్మినేని సత్యనారాయణరెడ్డి, ఏకుల ముసలారెడ్డి, పబ్బిశెట్టి శ్రీనివాస్, ఎల్లారెడ్డి రోషిరెడ్డి, ఆవుల కోటిరెడ్డి పాల్గొన్నారు.



ఫోన్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

## డ్వాక్రా రుణం చెల్లించమన్నందుకు దాడి

- గొడవ వద్దని సర్దిచెప్పినందుకు వైఎస్సార్ సీపీ నాయకుడి ఇంటిపై దాడి



తీవ్రంగా గాయపడిన శ్రీలక్ష్మీ



ధ్వంసమైన వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ గృహం



బరిసె, రాళ్లతో టీడీపీ కార్యకర్త గురునాథం

అర్ధవీడు(బేస్తవారిపేట): డ్వాక్రాలో తీసుకున్న రుణం చెల్లించమన్నందుకు మహిళపై దాడిచేసిన సంఘటన అర్ధవీడు మండలంలోని మాగుటూరులో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. గ్రామంలో స్వాతి గ్రూపు నుంచి 10 మంది సభ్యులు రూ.10 లక్షల బ్యాంకు రుణం తీసుకున్నారు. ఈ గ్రూపుకు లీడర్‌గా ఇప్పర్ల లక్ష్మమ్మ ఉన్నారు. గ్రూపులోని సభ్యురాలు కేశనపల్లి రమాదేవి రూ.లక్ష రుణం తీసుకుని నెలకు రూ.3 వేల ప్రకారం గత 20 నెలలుగా చెల్లించడం లేదు. ఇప్పర్ల లక్ష్మమ్మ కుమార్తె శ్రీలక్ష్మీ మరో సభ్యురాలైన కేశనపల్లి సుహాసిని ఇంటి వద్దకు వెళ్లి గ్రూపు రుణం చెల్లింపు విషయంపై మాట్లాడుతుండగా, రమాదేవి భర్త నారాయణ వచ్చి దుర్భాషలాడాడు. నారాయణ నోటికి వచ్చినట్లు మాట్లాడడటంతో శ్రీలక్ష్మి వెళ్లి మరో సభ్యురాలు విజయ భర్త అయిన మాజీ వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సర్వేశ్వరరావుకు విషయం చెప్పింది. సర్వేశ్వరరావు ఆమెను సర్దిచెప్పి పంపించారు. అయితే దీన్ని రాజకీయ రంగు పులిమేందేకు టీడీపీకి చెందిన కేశనపల్లి గురునాథం, నారాయణ, సుహాసిని, రమాదేవి ఎత్తుగడ వేశారు. కంభంలో ఉన్న గురునాథం కొడుకు వెంకటేశ్వర్లును పిలిపించుకున్నారు. నారాయణ, గురునాథం పూటుగా మద్యం సేవించి బత్తిన సర్వేశ్వరరావు ఇంటిపై దాడిచేశారు. గృహం తలుపు, కిటికీల గ్లాసు అద్దాలు పగులకొట్టారు. ఇంటిపై రాళ్ల వర్షం కురిపించారు. శ్రీలక్ష్మీ, బత్తిన విజయ, రామసుబ్బమ్మ, చిన్నారి నక్షత్రలపై దాడి చేశారు. ఈ ఐదేళ్లు మాదే రాజ్యం, ఒక్క రూపాయి కట్టం ఏం చేసుకుంటారో చేసుకొండని దుర్భాషలాడి వీరంగం సృష్టించారు. ఈ ఘటనలో శ్రీలక్ష్మీ చెయ్యి, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. జరిగిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## వైపాలెంలో రేషన్ షాపులపై సబ్ కలెక్టర్ దాడులు

- అడ్డుకోవడానికి ప్రయత్నించిన టీడీపీ నాయకులు

యర్రగొండపాలెం: స్థానిక రేషన్ షాపులపై మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా రాత్రి 10 గంటలు దాటిన తరువాత ఆకస్మిక దాడులు నిర్వహించారు. ముందుగా ఒక షాపు నంబర్ 4ను తనిఖీ చేశారు. ఆ షాపులో రేషన్ పంపిణీ జరగలేదని, స్టాక్ పూర్తిగా ఉన్నట్లు ఆయన గుర్తించాడు. ఆ తరువాత మరో మూడు షాపులను ఆయన తనిఖీ చేశారు. పువ్వాడ శ్వేతకు సంబంధించిన 22నంబరు షాపు డీలరు ఎంతసేపటికి స్పందించకపోవడంతో సబ్ కలెక్టర్ తన సిబ్బందితో ఆ షాపు తాళాలు పగులగొట్టించి తనిఖీ చేశారు. అందులో 5608కిలోల రేషన్ బియ్యంకుగాను 4390కిలోలు మాత్రమే పంపిణీ జరిగినట్లు ఆయన గుర్తించాడు. ఆ షాపు తనిఖీ చేస్తున్న సమయంలో టీడీపీ వర్గానికి చెందిన కొంతమంది నాయకులు అక్కడికి చేరుకొని మా ప్రభుత్వంలో మా షాపులు తనిఖీ చేయడం ఏంటని సబ్ కలెక్టర్‌ను నిలదీశారు. పట్టణంలో ఉన్న షాపులు మొత్తం తనిఖీ చేయాల్సిందేనని ఆయనపై తీవ్ర వత్తిడికి దిగారు. మరో షాపు తనిఖీకి వెళ్లిన ఆయనను టీడీపీ నాయకులు అడ్డుకోవడంతో పాటు ఎక్కువగా మాట్లాడటం మొదలు పెట్టారు. డీవీఎన్ కాలనీలో 200 బస్తాల రేషన్ బియ్యం స్టాక్ ఉన్నాయని తాను ఫోన్ చేసినప్పటికి స్పందించలేదని ఆయన కొంతమంది అధికారులను అవమానకరంగా మాట్లాడారు. రేషన్ షాపులు అన్నీ శుక్రవారం ఉదయం వచ్చి తనిఖీ చేస్తానని సబ్ కలెక్టర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆయన వెంట ఇన్‌చార్జి తహసిల్దార్ విజయభాస్కర్, సీఎస్ గోడౌన్ టీడీ తిరుపతిరెడ్డి ఉన్నారు.

## ప్రతిభ కనబరిచిన పోలీసులకు ప్రశంస పత్రాలు



ప్రత్యేక ప్రశంసాపత్రాలు పొందిన పోలీసు అధికారులు, సిబ్బందితో ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: కేసుల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన పలువురు పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఏఆర్ దామోదర్ గురువారం ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. గత నెల 31వ తేదీన సింగరాయకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో 8 మందిని పట్టుకొని వారి నుంచి 40 కేజీల గంజాయితో పాటు కారు, మోటార్ బైకును స్వాధీనం చేసుకున్న కేసులో ఎస్సై టి.శ్రీరాం, ఏఎస్సై సీహెచ్ శేషారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ తిరుపతిస్వామి, పీసీలు విజయ్‌కుమార్, శ్రీనివాసరావు, శ్యాం సుందరం, హోంగార్డు బాలరాజు, ఒంగోలు టూటౌన్ పీసీ ఖాజావలి, కానిస్టేబుల్ కోటేశ్వరరావులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. వివాహేతర సంబంధం కేసులో భార్య, అత్త, ప్రియుడు కలిసి చేసిన హత్య కేసులో ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ కేసులో సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన ఎస్‌బీ సీఐ రాఘవేంద్ర, కోర్టు లైజన్ హెడ్ కానిస్టేబుల్ ఏ. శ్రీనివాసులు, కురిచేడు కోర్టు కానిస్టేబుల్ సుభానిలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. మార్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో భార్యను హత్య చేసిన కేసులో న్యాయస్థానం జీవితశిక్ష విధించింది. ఈ కేసులో అప్పటి మార్కాపురం సీఐ శ్రీధర్‌రెడ్డి, కోర్టు లైజన్ కానిస్టేబుల్ ఐవీ శ్రీనివాసరావు, కోర్టు కానిస్టేబుల్ భాస్కరరావులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. పోలీస్‌స్టేషన్ పనితీరు, నిర్వహణ విషయంలో దర్శి ఎస్సై సుమన్, మద్దిపూడి ఎస్సై శివబసవరాజులను ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలు అందచేశారు. తోటి సిబ్బందికి స్ఫూర్తినిస్తూ మరింత ఉత్సాహంగా , క్రియాశీలకంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు.

## గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ పరంగా జరిగే గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా చూడాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులకు సూచించారు. ప్రకాశంభవనంలో గృహ నిర్మాణ సంస్థ, టిడ్కో ఆధ్వర్యంలో చేపట్టిన గృహ నిర్మాణ స్థితిగతులపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో పూర్తయినవి, వివిధ దశల్లో ఉన్న ఇళ్ల వివరాలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అధికారులు కలెక్టర్‌కు వివరించారు. నిర్మాణాలన్ని పూర్తి కావడంలో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. లబ్ధిదారులంతా త్వరగా ఇళ్లు పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. జిల్లాస్థాయిలో సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలన్నారు. టిడ్కో కాలనీల్లో మౌలిక వసతుల కోసం చెల్లింపులు జరిగిన పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ పేరయ్య, ఒంగోలు, మార్కాపురం ఈఈలు పెరుగు శ్రీనివాసప్రసాద్, వి. దాశరధిశర్మ, నియోజకవర్గాల డీఈఈలు, టిడ్కో ఈఈ వెంకటేశ్వరరావు, డీఈఈ వీరబ్రహ్మాచారి పాల్గొన్నారు.

## స్వామీ.. అలా అంటివేమి?

- సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నామన్న మంత్రి డోలా
- ఆయన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో ట్రోలింగ్స్

ఒంగోలు: తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు, సామాజిక భద్రత పెన్షన్ పథకం అమలు చేస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి ప్రకటించడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సింగరాయకొండ మండలంలోని పాకల పల్లెపాలెంలో గురువారం ఉదయం సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా విలేకరుల సమావేశంలో మంత్రి డోలాపై వ్యాఖ్యలు చేశారు. ఒక పక్క సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌తోపాటు ప్రభుత్వ పెద్దలంతా హామీలు అమలు చేయాలంటే లబ్ధిదారుల డేటా సేకరించాల్సి ఉంది, వచ్చే ఏడాది చూస్తామని చెబుతుంటే మంత్రి డోలా మాత్రం తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం పథకాలు అమలుపరుస్తున్నామని చెప్పడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. మంత్రి డోలా మాటలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి.

# రెండు వాహనాలు ఢీ

- ఒకరు మృతి



ఢీకొన్న రెండు వాహనాలు



మృతిచెందిన మాలకొండయ్య

బేస్తవారిపేట: రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన గురువారం మండలంలోని సోమవారిపేట బస్టాండ్ ఆవరణలో తోకపల్లె-కడప హైవే రోడ్డుపై జరిగింది. వివరాల్లోకి వెళితే కంభంకు చెందిన నుంజల మాలకొండయ్య(40) బేస్తవారిపేట బస్టాండ్‌లో కూరగాయలు కొనుగోలు చేసుకుని ఆటోలో బయలుదేరాడు. మాచర్ల నుంచి అనంతపురానికి త్తి విత్తనాల లోడ్‌తో వెళ్తున్న బోలేరో వాహనం సోమవారిపేట బస్టాండ్ వద్ద రాంగ్‌రూట్‌లో వెళ్లి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు రోడ్డు పక్కన గృహాల ముందు భాగంలో చెట్లను ఢీకొని నిలిచిపోయాయి. ప్రమాదంలో మాలకొండయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కూరగాయాలను కొనుగోలు చేసిన మాలకొండయ్య ఆటోలో గ్రామాల్లో తిరుగుతూ అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతని స్వగ్రామం తర్లుపాడు మండలం కలుజువ్వలపాడు. బేస్తవారిపేట మండలంలోని చిన్న ఓబినేనిపల్లెకు చెందిన శాంతితో వివాహం జరగడంతో కంభంలో కూరగాయల దుకాణం నిర్వహిస్తున్నాడు. బేస్తవారిపేటలో తెల్లవారుజామున కూరగాయాలు కొనుగోలు చేసుకుని వెళ్లే సమయంలో వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య శాంతి, ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు.

# ముస్లిం మహిళలపై వివక్ష లేదు




డాక్టర్ మజ్నును సత్కరిస్తున్న రెడ్ క్రాస్ ప్రతినిధులు

ఒంగోలు టౌన్: ముస్లిం మహిళలపై ఎలాంటి వివక్ష లేదని, ఇస్లాం మతం ముస్లిం మహిళలకు సమాన హక్కులు కల్పించిందని హై కోర్టు న్యాయమూర్తి షేక్ కరీముల్లా తెలిపారు. స్థానిక రెడ్ క్రాస్ భవనంలో గురువారం ముస్లిం మహిళల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇండియన్ రెడ్ క్రాస్ మహిళా విభాగం కన్వీనర్ కోటేశ్వరమ్మ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో కరీముల్లా మాట్లాడారు. త్రిపుల్ తలాక్ విషయంలో స్వార్థపరులైన కొందరు మత పెద్దలు వక్రభాష్యాలు చెప్పి పెడదోవ పట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో వీరనారీమణిగా పేరొందిన బేగం హజరత్ మహల్ చేసిన పోరాటం చరిత్ర ఎప్పటికీ మరిచి పోదని ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత డాక్టర్ షేక్ మజ్నూ అన్నారు. ఉన్నత విద్యాభ్యాసం చేసిన ఎంతో మంది ముస్లిం మహిళలు వైద్యులుగా, అధ్యాపకులుగా, శాస్త్రజ్ఞులుగా రాణిస్తూ దేశ ప్రగతిలో కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఆడపిల్ల చదువుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యురాలు ఏస్‌ఏ సమీరా, సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు సయ్యద్ షెహనాజ్, ఉత్తమ ఉపాధ్యయురాలు డాక్టర్ షేక్ మజ్నూలను సత్కరించారు. ఈ సభకు హాజరైన మహిళలకు ఆరోగ్య సంరక్షణా కిట్లు పంపిణీ చేశారు. ఒవుడా చైర్మన్ సింగరాజు మీనాకుమారి, కోసూరి శ్రీదేవి, సయ్యద్ ఇక్బాల్, రాఘువ , మారెళ్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.